# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 06-02-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. విద్యార్థులు స్వంతంగా అభ్యాస విధానాలను అలవర్చుకోవాలని "పరీక్షా పే చర్చ" కార్యక్రమంలో సూచించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.
2. రెపో రేటును 5.25 శాతం వద్దనే కొనసాగించాలని నిర్ణయించిన భారతీయ రిజర్వు బ్యాంకు.
3. కర్నూలు జిల్లాలో "మీ భూమి-మీ హక్కు కార్యక్రమం"లో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.
4. మచిలీపట్నం ఓడరేవుకు జాతీయ రహదారి అనుసంధానం కోసం 573.77 కోట్ల రూపాయలను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం.
5. రక్త హీనత సమస్య కలిగిన గర్భిణులకు ఎఫ్సీఎం ఇంజక్షన్ ఇవ్వనున్నామని వెల్లడించిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.

-----------------------

పరీక్షా పే చర్చ 9వ  సంచికలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ  ఈ రోజు విద్యార్థులతో సంభాషించారు. ఈ సందర్భంగా. విద్యార్థులు  పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళనను ఎలా అధిగమించాలనే విషయంపై ప్రధానమంత్రి పలు సూచనలు చేశారు. విద్యార్థులు  స్వంతంగా ప్రత్యేకమైన అభ్యాస విధానాలను అలవర్చుకోవాలని  సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు  ఇచ్చే సూచనలను జాగ్రత్తగా వినాలని, వాటిని లోతుగా అర్థం చేసుకోని స్వీకరించాలని  పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్గొన్న తెలంగాణకు చెందిన  ఎస్. వెంకటేష్ "నైపుణ్యాల శిక్షణపై  దృష్టి పెరుగుతున్న నేపథ్యంలో, విద్యార్థులు నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలా  లేక మార్కులకా ?" అని ప్రశ్నించారు. దీనికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ  సమాధానమిచ్చారు. నైపుణ్యాలను  జీవిత నైపుణ్యాలు, వృత్తిపరమైన నైపుణ్యాలు అనే రెండు వర్గాలుగా విభజించవచ్చని  విద్యార్థులు రెండింటినీ అభివృద్ధి  చేసుకోవడంపై దృష్టి పెట్టాలని ప్రధానమంత్రి సూచిస్తూ...

వాయిస్ 30 సెకన్లు

----------------------

"పరీక్ష పే చర్చా కార్యక్రమం"లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన సూచనలు, సలహాలు తమకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని అనంతపురం పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు తెలిపారు. ఈ రోజు జరిగిన ప్రధానమంత్రి పరీక్షా పే చర్చా కార్యక్రమంను అనంతపురం కేంద్రీయ విద్యాలయం నుంచి విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలకు

చెందిన విద్యార్థి జితేంద్ర మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

-----------------------

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తున్నారు . జిల్లాలోని కలుగట్లలో "మీ భూమి-మీ హక్కు కార్యక్రమం"లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలో పాల్గొన్నారు ఈ  సందర్భం గా రాష్ట్ర ప్రభుత్వం రాజ్యముద్రతో ముద్రించిన కొత్త పట్టాదారు పాసు  పుస్తకాలను  పంపిణీ చేస్తారు. అనంతరం, ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడతారు. తరువాత వ్యవసాయ క్షేత్రంలో పర్యటించి   రైతులతో ముఖాముఖి చర్చిస్తారని అధికారులు తెలిపారు.

-----------------------

రెపో రేటును 5.25 శాతం వద్దనే కొనసాగించాలని  నిర్ణయించామని భారతీయ రిజర్వు బ్యాంకు-ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ముంబైలో ఈ రోజు పాత్రికేయులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్రవ్య విధాన కమిటీ - ఎంపిసి  రెపో రేటును 5.25 శాతం వద్దనే కొనసాగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించిందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4శాతం వృద్ధి నమోదవుతుందని అంచనావేస్తున్నామని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27 తొలి త్రైమాసికంలో 6.9శాతం, రెండో త్రైమాసికంలో 7శాతం వృద్ధి నమోదవ్వొచ్చని తెలిపారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని మచిలీపట్నం ఓడరేవును జాతీయ రహదారితో అనుసంధానించేందుకు కొత్తగా 6 వరుసల రహదారి నిర్మాణానికి 573.77 కోట్ల రూపాయలను మంజూరు చేశామని కేంద్ర రహదారులు , రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. దీని పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఎక్స్ వేదికగా స్పందిస్తూ రాష్ట్రంలో జాతీయ రహదారులను మెరుగుపరచడంలో, రవాణా సమయాన్ని గణనీయంగా తగ్గించడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని పాటు చెప్పారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న జాతీయ రహదారులను త్వరగా పూర్తి చేసేందుకు సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-----------------------

రక్త హీనత సమస్య కలిగిన గర్భిణులకు ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్ -ఎఫ్సీఎం ఇంజక్షన్ ఇవ్వనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుతం బాలింతలకు మాత్రమే ఇచ్చే ఈ ఇంజక్షన్ను త్వరలో గర్భిణీలకు కూడా ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. హీమోగ్లోబిన్ పది అంతకంటే తక్కువగా ఉన్న వారికి మాత్రమే ఇచ్చే ఈ ఇంజక్షన్ వల్ల హీమోగ్లోబిన్ పెరిగి రక్తహీనత సమస్య పరిష్కారం అవుతుందని, తద్వారా ప్రసవ సమయంలో ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. ఈ ఇంజెక్షన్ అవసరమైన గర్భిణులకు తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ ద్వారా ఉచిత రవాణా సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని చెప్పారు. గర్భిణులకు కూడా ఇచ్చేందుకు కేంద్రం కేటాయించిన 18,500 ఇంజెక్షన్లను

త్వరలో జిల్లాలకు పంపించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

----------------------

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో విజయవాడ అజిత్ సింగ్ నగర్ లో ."డ్రగ్స్ పై దండయాత్ర" లో భాగంగా ఈరోజు సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన సైకిల్ యాత్ర ప్రారంభించారు.

అనంతరం రాజశేఖర్ బాబు మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

----------------------

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తున్నట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో 36లక్షల రూపాయలతో నిర్మించనున్న ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రాథమిక చికిత్స, మాతా-శిశు సంరక్షణ, టీకాలు, చిన్నపాటి రోగాలకు మందులు లభిస్తాయని అన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

----------------------

'వందే మాతరం కోస్టల్ సైక్లోథాన్-2026' కార్యక్రమంలో భాగంగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం -సీఐఎస్ఎఫ్ చేపట్టిన సైకిల్ యాత్ర కొనసాగుతుంది శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి ఈ రోజు దర్శించుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాతూ.. పశ్చిమ బెంగాల్, గుజరాత్ లఖ్‌పత్ నుండి ఈ రెండు బృందాలు 9 తీరప్రాంత రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల మీదుగా సుమారు 6,600 కిలోమీటర్లు సైక్లోథాన్ నిర్వహిస్తున్నారని తెలిపారు.

వాయిస్ 30 సెకన్లు

----------------------

రాష్ట్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 9వ తేదీ నుండి 28 వరకూ జనగణన జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. జనగణన -2027పై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి విజయానంద్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, జనాభా లెక్కల సేకరణ ప్రకియ సజావుగా జరిగేందుకు ఇప్పటి నుండే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జనాభా లెక్కల ప్రక్రియపై క్షేత్ర స్థాయిలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రెండు దశల్లో జనగణన ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు

----------------------

తిరుమల తిరుపతి దేవస్థానం - టీటీడీ నూతన కార్యనిర్వహణాధికారిగా ఎం. రవిచంద్ర ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న తరువాత ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఈవోగా బాధ్యతలు చేపట్టారు.

----------------------